# జల హారతి కార్యక్రమానికి రైతులకు జనసేన పిలుపు




**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 30:** పాయకరావుపేట నియోజకవర్గంలో వచ్చే నెల 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న జల హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులకు జనసేన పార్టీ పిలుపునిచ్చింది. జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగా సుధాకర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రైతుల చిరకాల కలను సాకారం చేస్తూ గోదావరి జలాలను రైతుల పొలాలకు అందించే దిశగా మరో చారిత్రాత్మక అడుగు పడనుందని అన్నారు. ఈ నీటి ద్వారా పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లోని రైతులకు తొలి విడతగా సాగునీరు అందుతుందని ఎన్నో ఏళ్లుగా గోదావరి జలాల కోసం ఎదురుచూస్తున్న రైతుల పొలాలకు నీరు చేరడం ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జలహారతి కార్యక్రమాన్ని రైతుల పండుగగా భావించి నక్కపల్లి మండలంలోని రైతులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ తరఫున పిలుపునిచ్చారు.

రైతుల జీవితాల్లో వెలుగులు నింపే ఈ మహత్తర కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పూర్తి చేయడంలో కృషి చేసిన భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి రైతుల తరఫున, జనసేన పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నాయకులు అన్నారు.

ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు రత్నాజీ, కార్యదర్శి ఉమామహేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు హరికృష్ణ, బాబ్జి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు





- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పరిటాల రవీంద్ర ముద్ర
- పరిటాల రవీంద్ర ఆశయాలను ముందుకు తీసుకు వెళ్దాం
- ధర్మవరంలో శాంతి కుసుమాలు పూయించిన వీరుడు పరిటాల రవీంద్ర

**ధర్మవరం ఆగస్టు 30 (పెన్ సత్తా)** మాజీ మంత్రివర్యులు పెనుకొండ మాజీ శాసనసభ్యులు పరిటాల రవీంద్ర 68వ జయంతి వేడుకలను ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ధర్మవరం పట్టణం గాంధీనగర్ సర్కిల్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి మరియు ఎన్టీఆర్ చిత్రపటానికి తెదేప నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా భారీ స్థాయిలో కార్యకర్తలు మధ్యలో కేక్ కట్ చేసి పరిటాల రవీంద్ర అమరహే, పరిటాల రవీంద్ర ఆశయాలను కొనసాగిస్తామని కార్యకర్తలు ప్రతిన బూనారు. పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా తెదేపా కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ, 1994 సంవత్సరంకు మునుపు రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ఫ్యాక్షన్ గొడవలతో అతలాకుతల మౌతున్న తరుణంలో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో ఇరువర్గాలను రాజీచేసి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శాంతి కుసుమాలు పూయించిన ధైర్యశాలి అని పరిటాల రవీంద్ర చేసిన మంచి పనులను తెదేపా నాయకులు గుర్తుకు చేసుకున్నారు. అదేవిధంగా ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలు ఒంటరిగా తిరగలేని అప్పటి సమయంలో పరిటాల రవీంద్ర ధర్మవరం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి అరాచక శక్తులను పీచమనచి నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు, ప్రజలకు పార్టీ కార్యకర్తలకు స్వేచ్ఛ స్వాతంత్రం, భరోసా కల్పించిన మహానాయకుడు పరిటాల రవీంద్ర అని తెదేపా నాయకులు పేర్కొన్నారు. 1994-2004 మధ్యకాలంలో ఎంతోమంది పార్టీ నాయకులకు కార్యకర్తలకు పార్టీ పదవుల్లో ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించిన పరిటాల రవీంద్ర నాయకత్వాన్ని ఎప్పటికీ మరిచిపోలేమని ఆయన స్మృతులను నిత్యం గుర్తు చేసుకుంటామని ఈ సందర్భంగా తెదేపా నాయకులు రవీంద్ర తీపి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు.

పార్టీ కార్యకర్తల కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహనీయుని జ్ఞాపకాలను ఎన్నటికీ తెదేపా గుర్తు పెట్టుకుంటుందని వారు పేర్కొన్నారు. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పరిటాల రవీంద్ర ఆశయ సాధన కోసం మేమంతా కృషి చేస్తామని, ధర్మవరం నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశయ సాధన కోసం ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా తెదేపా నాయకులు తెలియజేశారు.

# వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా యూత్ అధ్యక్షుడిగా వెల్దుర్తి తేజ



**ధర్మవరం, ఆగస్టు 30 (పెన్ సత్తా)** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా యూత్ అధ్యక్షుడిగా వెల్దుర్తి తేజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీమల జయ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వెల్దుర్తి తేజ మాట్లాడుతూ వాల్మీకి సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వాల్మీకి సమాజానికి ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ సాధించడమే తమ ఏకైక లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం యువతను ఐక్యంగా సమీకరించి, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

జిల్లాలో వీఆర్‌పీఎస్‌ను మరింత బలోపేతం చేసి, వాల్మీకి సమాజ హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తానని తేజ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# బీజేపీ సత్యసాయి జిల్లా జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి బీరే నియామకం

**ధర్మవరం, ఆగస్టు 30 (పెన్ సత్తా)**

బీజేపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ చేతుల మీదుగా విజయలక్ష్మి బీరే బీజేపీ సత్యసాయి జిల్లా జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మార్గదర్శకత్వంలో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ, సత్యసాయి జిల్లాలో బీజేపీ సంస్థాగత బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని విజయలక్ష్మి బీరే తెలిపారు.

తనపై విశ్వాసం ఉంచి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ కి, అలాగే పార్టీ సంస్థాగతంగా సహకరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, జింక చంద్రశేఖర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




# రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా?

**విశాఖపట్నం :(పెన్ సత్తా)** రాష్ట్రంలో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, రోజుకో కొత్త సమస్యతో సామాన్య, మధ్యతరగతి ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు తలకిందులై పిల్లలతో సహా కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ఆడపిల్లలపై దాడులు, గంజాయి మత్తులో దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని ఆయన మండిపడ్డారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పూర్తిగా గాలికొదిలేసి నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, డీఎస్సీ అక్రమాలపై శాసనమండలిలో చర్చకు రాకుండా ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. డిఎస్సీపై లోకేష్, చంద్రబాబు తనతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఇంకా ఏమన్నారంటే...

రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా?

గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో పాలన చూస్తుంటే అసలు ప్రభుత్వం ఉందా? అనే అనుమానం కలుగుతోంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రజలు గోదావరి, కృష్ణా నదుల్లో దూకి పిల్లలతో సహా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి. గంజాయి తాగి యాక్సిడెంట్లు చేసి మనుషులను చంపుతున్నారు, కేసుల్లేకుండా మేనేజ్ చేసుకుంటున్నారు. వీటన్నింటినీ అరికట్టాల్సిన ముఖ్యమంత్రి, అధికారిక పర్యటనలకు వచ్చి సమస్యల పరిష్కారంపై కాకుండా కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతున్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

నియంత్రణ చర్యలు ఏవి?:

సామాన్యుడు కడుపునిండా తిని బతికే పరిస్థితి లేకుండా పోయింది. మార్కెట్లో ధరలను నియంత్రించే చర్యలను పూర్తిగా గాలికొదిలేశారు. వేరుశెనగ నూనె గతంలో రూ. 150 - 160 ఉంటే, ఇప్పుడు కిలో రూ. 215కి చేరింది. గ్యాస్ సిలిండర్ ధర రూ. 72 పెరిగి రూ. 937కు చేరింది. పంచదార రూ. 45 నుంచి రూ. 75కి, ఉల్లిపాయలు రూ. 20 నుంచి రూ. 70కి పెరిగాయి. అన్నపూర్ణ లాంటి ఏపీలో నాణ్యమైన బియ్యం కిలో రూ. 40-55 నుంచి ఏకంగా రూ. 65-75కి చేరింది. ధరలు పెరిగితే ఇతర రాష్ట్రాల నుంచి నిత్యావసరాలను తెప్పించి నియంత్రించాలనే సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదు. అందరూ చంద్రబాబులాగా కోటీశ్వరులు కాదు, కిలోకి రూ. 20 పెరిగితే సామాన్యుడు ఎలా బతుకుతాడు?.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో 430 పోస్టుల కుంభకోణం -- సీబీఐ ఎంక్వైరీ వేయండి!

దేశంలో, ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా పరీక్ష రాయకుండా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా పేరిట ఉద్యోగాలు ఎలా ఇచ్చారు? ముందుగా జీవో ఇచ్చి, ఉద్యోగాలు తమ వాళ్లకు ఇచ్చేసుకున్నాక ఆ జీవోను ఎందుకు రద్దు చేశారు? 430 ఉద్యోగాలను బహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారు. ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి టాప్ ర్యాంక్ ఎలా వచ్చింది? జిల్లాల వారీగా మెరిట్ లిస్టులు ఎందుకు బయటపెట్టలేదు? ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి సీబీఐ విచారణ జరిపించాలి. దమ్ముంటే లోకేష్ లేదా చంద్రబాబు నాతో బహిరంగ చర్చకు రావాలి. అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి.. కౌన్సిల్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వమంటే సమాధానం చెప్పలేక పారిపోయారు.

విద్య, వైద్యం, ఆహార భద్రతలను భ్రష్టు పట్టించారు..

రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఫుడ్ సెక్యూరిటీలను కూటమి ప్రభుత్వం నాశనం చేసింది. పాఠశాలల్లో గోడలు కూలి విద్యార్థులు చనిపోతుంటే మంత్రుల్లో, అధికారుల్లో స్పందన లేదు. 'నాడు-నేడు' పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గతంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పీహెచ్‌సీల్లో మందులు ఇచ్చి పర్యవేక్షించేవాళ్లం, ఇప్పుడు 'సంజీవని' అని పేరు మార్చి ఏ కొత్త విషయం తెచ్చారో చెప్పాలి. ఆసుపత్రులకు వెళ్తే వైద్యం అందక, మందులు లేక ప్రజలను తిప్పి పంపుతున్నారు. రోజుకు పదిసార్లు కరెంటు కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు.

మహిళలను మోసం చేస్తూ ఊకదంపుడు ప్రచారాలు

సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న హామీ ఏమైంది? కొత్తగా ఒక్క పెన్షన్ ఇచ్చే దిక్కులేదు కానీ, మహిళలను లక్షాధికారులను చేస్తామని మాయమాటలు చెబుతున్నారు. వైఎస్సార్ హయాంలో పావలా వడ్డీ, ఆ తర్వాత సున్నా వడ్డీతో మహిళలను ఆదుకుంటే.. చంద్రబాబు రాగానే సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తేశారు. 'తల్లికి వందనం' కింద పూర్తి మొత్తం ఇవ్వకుండా రూ. 7, 8, 9 వేలు మాత్రమే విదిల్చి మిగిలిన బకాయిలను ఎగ్గొట్టారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి

## రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా?

**నంద్యాల:(పెన్ సత్తా)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటి మూడో సంవత్సరంలోకి వచ్చినా రైతుల కష్టాలు మాత్రం తీరలేదని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ఏడాది పంట నష్టం, రెండో ఏడాది గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఈ ఏడాది పంటలు సాగు చేయలేని దుర్భిక్ష పరిస్థితులు రైతులను వెంటాడుతున్నాయని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులో 873 అడుగుల నీటి నిల్వ ఉన్నప్పటికీ రాయలసీమకు సాగు, తాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.

కానాల చెరువును పరిశీలించిన శిల్పా రవి

ఆదివారం నంద్యాల మండలం కానాల చెరువును స్థానిక నాయకులు, రైతులతో కలిసి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పరిశీలించారు. చుక్కనీరు లేక చెరువు ఎండిపోయిందని, గత రెండేళ్లుగా నష్టపోతున్న రైతులు ఈ ఏడాదైనా ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుందని ఆశించారని, వారి ఆశలు నిరాశగా మారాయని తెలిపారు. ప్రభుత్వ అధికారులే పంటలు సాగు చేయవద్దని సూచిస్తున్న పరిస్థితుల్లో రైతులకు ప్రత్యామ్నాయ వనరులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకం ఎందుకు నిలిపివేశారు?

వైయస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం దాదాపు 90 శాతం పూర్తయిందని, మిగిలిన పనులను పూర్తి చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేయడం సరికాదని శిల్పా రవి అన్నారు. సాగునీరు లేక రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి, తాగునీరు లేక గ్రామాల్లో ప్రజలు, పశువులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దిగువకు నీటిని విడుదల చేసి రాయలసీమ ప్రజలను ఆదుకోవాలని కోరారు.

రైతులకు బీమా, అన్నదాత సుఖీభవ ఎక్కడ?

రైతులకు కనీసం పంటల బీమా కూడా అందడం లేదని, అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేదని శిల్పా రవి పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు.

కానాల చెరువు మట్టి తవ్వకాలపై శ్వేతపత్రం

కానాల చెరువులో మట్టి తవ్విన గుంతలు కనిపిస్తున్నాయని, ఆ మట్టిని ఏ ప్రాజెక్టు అవసరాల కోసం తవ్వారు, దాని ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ఎంత, మైనింగ్ వారికి ఎంత, ఇరిగేషన్ శాఖకు ఎంత అందిందో ప్రభుత్వం వెల్లడించాలని శిల్పా రవి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రంగారావు, పీడీ ఉసేన్, శంకర్, కాసిం, మరియదాస్, కరీం, షక్రుద్దీన్, అల్లూరయ్య, సన్నా, జమాల్ బాషా, ఫరూక్, నాగవుశేని, మధుగౌడ్, పకీర్ సా తదితరులు, గ్రామ రైతులు, వైయస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# నారాయణ ఇ టెక్నో స్కూల్ నందు జరిగిన నేషనల్ స్పోర్ట్స్ డే

**చదువులతో పాటు ఆటపాటలు పిల్లలకు శారీరిక మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఆరోగ్యాన్ని ఇస్తయి**

కొవ్వూరు మూడు డాబాల వీధిలో ఉన్న నారాయణ ఇ టెక్నో స్కూల్ నందు జరిగిన నేషనల్ స్పోర్ట్స్ డే గురించి ప్రిన్సిపాల్ రాంబాబు వివరిస్తూ చదువులతో పాటు ఆటపాటలు పిల్లలకు శారీరిక మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఆరోగ్యాన్ని ఇస్తాయని కాబట్టి పిల్లలు ప్రతిరోజు చదువులతోపాటు ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గోవాలని సూచించారు ఈరోజు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదిన వేడుకలు జరుపుకుంటూ ఆయన క్రీడా రంగానికి చేసిన విశిష్ట సేవలను గుర్తు చేశారు దేశానికి మూడుసార్లు ఒలింపిక్ బంగారు పతకాన్ని సాధించిన వారిని ఆదర్శంగా ముందుకు సాగాలని మరియు క్రీడల యొక్క ఆవశ్యకతను తెలియజేశారు అలాగే వ్యాయామ ఉపాధ్యాయుడు సాకా శ్రీను పిల్లలతో ఆసక్తికరమైన ఆటపాటలతో అందరిని ఆకర్షింప చేశారు వివిధ రకాల ఆటలు నిర్వహించి వాటిలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ



కార్యక్రమంలో డీజీఎం రామిరెడ్డి ఆర్ ఐ సురేష్ హై స్కూల్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ ప్రైమరీ కోఆర్డినేటర్ సాహిత్య అకడమిక్ డీన్ కనకదుర్గ వైస్ ప్రిన్సిపల్స్ జి రోజ ఎం శివ కుమారి ప్రైమరీ వైస్ ప్రిన్సిపల్ వేణు ప్రీ ప్రైమరీ వైస్ ప్రిన్సిపల్ సుధా లైఫ్ స్కిల్స్ ట్రైనర్ నితిన్ ఏవో రాజేష్ వ్యాయామ ఉపాధ్యాయుడు సాక శ్రీను ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర బృందం పాల్గొన్నారు.

# రాష్ట్ర చేనేత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటి ఆధ్వర్యంలో సమావేశం

రాష్ట్రంలోని చెనేత సహకార సంఘాల సమస్యల సత్వర పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర చేనేత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటి ఆధ్వర్యంలో సహకార సంఘాల ప్రతినిధులు మరియూ
ఏపీ డబ్ల్యు ఏ జె ఏ సి
ఆర్గనైజింగ్ కమిటి (కార్యక్రమాల నిర్వహణ కమిటి) సభ్యులతోనూ ఉమ్మడి ప్రత్యక్ష సమావేశం సెప్టెంబర్ 2 న బుధవారం ఉదయం 10 గంటలకు మంగళగిరి పట్టణంలోని తెనాలి ఫ్లైఓవర్ వద్ద నున్న మార్కండేయ కళ్యాణ మండపం నందు నిర్వహించబడును.చేనేత సహకార సంఘాలకు తక్షణం ఎన్నికలు నిర్వహించాలనీ, త్రిఫ్ట్ ఫండ్, యార్న్ సబ్సిడి, పావలా వడ్డీ, 20% మరియు 30% రిబేట్, మార్కెటింగ్ ఇన్సెంటివ్ తదితర 5 ప్రభుత్వ పథకాల ద్వారా ప్రభుత్వం నుండి చేనేత సహకార సంఘాలకు రావలసిన ప్రభుత్వ బకాయిలు 203 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలనీ, చేనేత సహకార సంఘాల రుణమాఫీకి సంబంధించి ఇప్పటికే సిద్ధంగావున్న ప్రతిపాదనల దస్త్రాలపై ప్రభుత్వం ఆమోదముద్ర వేసి 46 కోట్ల 19 లక్షల రూపాయల రుణమాఫీని చేనేత సహకార సంఘాలకు వర్తింపచేయాలని, ఆప్కో ను ప్రక్షాళన చేయాలనీ, చేనేత ముడిసరుకులపై మరియూ చేనేత వస్త్రాలపై జీఎస్టీ రీయింబర్స్మెంట్ చేయాలన్న ప్రధాన డిమాండ్ల సాధన



కోసం నిర్వహించే చేనేతల రౌండ్ టేబుల్ సమావేశానికి చేనేత సహకార సంఘాల ప్రతినిధులు మరియూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి సభ్యులు అందరూ తప్పనిసరిగా పాల్గొనవలసిందగా కోరుతూ రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా కృష్ణాజిల్లాలోని పెడన, కప్పలదొడ్డి, మచిలీపట్నం, పోలవరం, ఐదుగుళ్ళపల్లి, మల్లవోలు, రాయవరం తదితర ప్రాంతాల్లోని చేనేత సహకార సంఘాలనూ సందర్శించడమైనది.
ఈ పర్యటనలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి రాష్ట్ర కో కన్వీనర్ భండారు ఆనంద ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి రాష్ట్ర కో కన్వీనర్ పిల్లలమర్రి బాలకృష్ణ, మరో కో కన్వీనర్ కట్ట శివదుర్గా రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కట్ట హేమసుందర రావు, చేనేత కార్మిక సంఘం నాయకులు గోరు రాజు, పంచల నరసింహారావు, చేనేత నాయకులు ఎర్ర టార్జాన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి సేవ. పూర్వజన్మ సుకృతం మంత్రి నారాయణ







నెల్లూరు నవాబుపేటలోని అత్యంత ప్రాచీనమైన బలిజ వారి శ్రీ శ్రీ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరగగా, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సతీమణి రమాదేవితో కలసి పాల్గొని వాస్తు పూజ, అమ్మవారి హోమం నిర్వహించారు. పూర్ణకుంభంతో స్వాగతం అందుకున్న మంత్రి దంపతులు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి నారాయణ మాట్లాడరు..అమ్మవారి సేవ చేయడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని, 2019లోనే ఆలయ స్థల సేకరణ కోసం 23 అంకణాల స్థలానికి 28 లక్షలు అందించామని, ప్రస్తుతం దాతల సాయంతో 1.01 కోట్ల అంచనా వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని వెల్లడిస్తూ, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి పురపాలక శాఖ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణానికి దేవస్థాన కమిటీ, బలిజ సంక్షేమ నాయకులు, దాతలకు అభినందనలు తెలిపిన మంత్రి, భక్తులందరూ ఈ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డివిజన్‌కు విచ్చేసిన మంత్రికి స్థానిక మహిళలు రాఖీలు కట్టగా ఆయన వారికి స్వీట్లు తినిపించి ఆప్యాయత చాటుకోగా, కార్యక్రమం అనంతరం డాక్టర్ పోకల రవి (5 లక్షలు), పప్పు నారాయణ (2 లక్షలు), సుబ్రహ్మణ్యం ( 1 లక్ష), రంగయ్య నాయుడు ( 25 వేలు) ముందుకు వచ్చి మొత్తం 8.25 లక్షల నగదు విరాళాలను మంత్రి నారాయణకు అందజేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, నగరాధ్యక్షుడు మామిడాల మధు, 7వ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధరలు పెంపుతో సంక్షోభంలో ఆక్వా రంగం

**వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు**

ఫిబ్రవరిలో రూ.4 లు తగ్గించిన ఆక్వా ఫీడ్ ధరలను నేడు కూటమి ప్రభుత్వం రూ. 12 లు పెంచడంతో రాష్ట్రంలో ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని అప్పడా మాజీ వైస్ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు ఆరోపించారు.తాడేపల్లిగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 169, 57 జీవోలతో రైతులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు.ఫిబ్రవరిలో 4 రూపాయలు తగ్గించి,ఇప్పుడు ఏకంగా కేజీకి 12 రూపాయలు పెంచారని, మళ్లీ 14 రూపాయలు పెంచేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు.కేజీకి 14 నుంచి 15 రూపాయలు పెంచడం అంటే క్వింటాకు 15 వేలు భారం పడుతుందన్నారు.ఎస్.కె.రెట్టింగ్ కంపెనీ సెప్టెంబర్ 1 నుంచి వనామీపై రూ.5.70, టైగర్ ప్రాన్ ఫీడ్ పై రూ.3.80 పెంచుతున్నట్లు ప్రకటించిందని, కానీ రాష్ట్రంలో కంపెనీలు ఏకంగా 14 రూపాయలు ఎలా పెంచుతాయని ప్రశ్నించారు. ఫీడ్ కంపెనీల నుంచి ముడుపులు అందడంతోనే సీఎం చంద్రబాబు నోరు మెదపడం లేదన్నారు.జగన్ హయాంలో ఫీడ్ పై రూ.2.50 పెంచితే జే-ట్యాక్స్ అని గగ్గోలు పెట్టారని, ఇప్పుడు రెండేళ్లలో కేజీకి రూ.28 భారం పడుతోందని, ఇది సీఎల్పీ ట్యాక్స్ కాదా అని ఎద్దేవా చేశారు.57 జీవోలో 0.90 నుంచి 0.95 పవర్ ఫ్యాక్టర్ ఉంటేనే రూపాయిన్నర సబ్సిడీ వర్తిస్తుందని మెలిక పెట్టారని, హెక్టారుకు కెపాసిటర్ కు 70 వేలు చొప్పున రాష్ట్రంలో రెండు లక్షల హెక్టార్లకు రూ.1400 కోట్ల భారం రైతులపై పడుతుందన్నారు.జగన్ పర్యటనతోనే రొయ్య రేట్లు పెరిగాయని రైతులు చెబుతున్నారని, ఆక్వా రైతులకు వైసీపీ అండగా ఉంటుందని, పెంచిన ఫీడ్ రేట్లను వెంటనే రోల్ బ్యాక్ చేయాలని డిమాండ్ చేశారు.




# డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షులు- బోనం నాగేశ్వరరావు



పాశర్లపూడి లంక ఏటు బాడవ వద్ద డోర్ కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్లు,సూపర్ సిక్స్ పథకాలు గురించి తెలియపరిచారు మండల అధ్యక్షులు బోనం నాగేశ్వరరావు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయండి వెంటనే పరిష్కరిస్తాము అని హామీ ఇస్తూ, వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో అందరూ కూటమి నిలబెట్టిన అభ్యర్థులు గెలిపించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి పథకములో ముందుకు వెళుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కుడుపూడి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ కోలా సత్తిబాబు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కోలా సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పితాని వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కుడుపూడి వెంకటేశ్వరరావు,గుడుమేలంక కాశి, మంద వెంకటేశ్వరరావు, తోత్తరమూడి శ్రీను,చవటపల్లి నరసింహమూర్తి, చేగోండి అన్నవరం,గుత్తుల ప్రసాద్, దొమ్మేటి జగదీష్, వాసంశెట్టి దుర్గాప్రసాద్, మట్ట కొండ, మట్ట రాజు, విత్తనాల నాని, మరియు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# జీలుగుమిల్లి గ్రామంలో ఘనంగా శ్రీ ముత్యాలమ్మ సేవ .



వర్షాలు కురిపించి పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవత శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి కి అంగరంగ వైభవంగా గ్రామంలో సేవ నిర్వహించారు. . గ్రామస్తులు గ్రామ పెద్దలు మహిళలు ఆడపడుచులతో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు . గ్రామ పెద్దలు గ్రామస్తులు సహకారంతో సేవ కార్యక్రమాలు రెండు రోజులు పాటు గ్రామంలో నిర్వహించనున్నారు. మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ పెద్దలు తెలియజేశారు. .

# ప్రథమ స్థానం పొందిన మల్లారం జట్టు

**ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అభినందనలు**



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మల్లారం జట్టు ప్రథమ స్థానం పొందడంతో జట్టు సభ్యులను పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో వేలేరుపాడు మండలం రామవరం పంచాయతీలోని మల్లారం గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చిర్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జట్టు సభ్యులకు రెండు వాలీబాల్ కిట్లు, జెర్సీలు, బ్యాంకర్లు, అలాగే రూ.20వేలు నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారికి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగగలరని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రామవరం పంచాయతీతో పాటు పోలవరం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకువచ్చిన జట్టు సభ్యులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అభినందించారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు మెచినేని సంజయ్, వాలీబాల్ జట్టు సభ్యులు మనోజ్ కుమార్, అభిరామ్, ఉదయ్ కిరణ్, వెంకన్న బాబు, గణేష్, పవన్ రాజు, అరవింద్, రాము తదితరులు పాల్గొన్నారు..

# కార్తికేయ ఇన్ఫ్రా అండ్ డెవలపర్స్ కోస్టల్ పార్క్ వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమం




గూడూరు మండలం తరకటూరు వద్ద కార్తికేయ ఇన్ఫ్రా అండ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోస్టల్ పార్క్ వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ కొల్లు రవీంద్ర , పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ ఇతర ప్రముఖులతో కలిసి పాల్గొనడం జరిగింది.రియల్ ఎస్టేట్ రంగంలో పెడన నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన సేవలు, మెరుగైన మౌలిక వసతులు అందించాలని ఆకాంక్షిస్తున్నాను.పెడన పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ, సామాన్యులు సైతం సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా కోస్టల్ పార్క్ వెంచర్ సహకారం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

